తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 07 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 346 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్లుకు భారత్ సిద్ధం

- ఆపరేషన్ అభ్యాస్: దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ ఆదేశాలు
- మాక్ డ్రిల్ లక్ష్యం: ప్రజలలో అవగాహన – సమన్వయం – సురక్షత
- డ్రిల్‌లో శిక్షణ అంశాలు: సైరన్ ప్రాముఖ్యత, రెస్క్యూ పద్ధతులు
- డాల్ సరస్సులో ఎన్డీఆర్ఎఫ్ ప్రాక్టీస్: పడవ ప్రమాదాలపై మాక్ డ్రిల్
- 1971 తర్వాత దేశవ్యాప్తంగా ఇటువంటి మాక్ డ్రిల్ మొదటిసారి
- తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం ఎంపిక



వివరాలు 2లో..

# టూరిజం, పెట్టుబడుల కోసం మిస్ వరల్డ్ పోటీలు – మంత్రి జూపల్లి

- మిస్ వరల్డ్ ఈవెంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని జూపల్లి ధ్వజం
- ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందని స్పష్టం
- ఈ ఖర్చు కూడా తిరిగి ప్రభుత్వానికే వస్తుందని మంత్రి హామీ
- ఫార్ములా ఈ రేసుపై తప్పు కాదు, నిబంధనలు ఉల్లంఘించిన ఖర్చులపైనే ఆక్షేపణ
- బీఆర్ఎస్ విమర్శలపై మండిపడిన జూపల్లి




వివరాలు 2లో..

## రాష్ట్రవ్యాప్తంగా 3989 మినీ
# అంగన్వాడీ టీచర్లకు పదోన్నతి



- ఇకపై మెయిన్ అంగన్వాడీ టీచర్లతో సమాన వేతనం
- వేతనంలో భారీ పెరుగుదల – రూ.7,800 నుంచి రూ.13,650
- సాంకేతిక, న్యాయపరమైన సమస్యలతో ఆలస్యం – ప్రభుత్వం వివరణ
- మే నెల నుంచే ఉత్తర్వులు అమల్లోకి – రెగ్యులర్ జీతాలు లభ్యం
- మంత్రి సీతక్కకు మినీ అంగన్వాడీ టీచర్ల నుంచి కృతజ్ఞతలు
- తాజా నిర్ణయంతో ఆర్థికంగా స్థిరపడే అవకాశం – టీచర్ల ఆనందం

వివరాలు 2లో..

# ఆపరేషన్ సిందూర్



- పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ మెరుపుదాడులు
- ఉగ్రదాడి ఉద్రిక్తతల మధ్య కీలక మిలిటరీ చర్య
- 'ఆపరేషన్ సిందూర్' తో ఉగ్ర స్థావరాల ధ్వంసం
- అర్ధరాత్రి 1:44కు భారత వైమానిక దళం ఆకస్మిక దాడులు
- తొమ్మిది ఉగ్ర స్థావరాలపై కచ్చితమైన దాడులు
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని కీలక ఉగ్రగూళ్ల లక్ష్యం
- పాక్ సైనిక స్థావరాలను లక్ష్యం చేయలేదు: భారత్
- ఉద్రిక్తతకు తావు కలిగించకుండా సుదూర ప్రణాళిక
- పాక్ ప్రధాని ఘాటు స్పందన

వివరాలు 3లో..








## భారత్-యూకే చారిత్రాత్మక
# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన మైలురాయి**



- చర్చల అనంతరం ఒప్పందం కుదరిన నేపథ్యం
- మోదీ – కీర్ స్టార్మర్ మధ్య ఫోన్ సంభాషణ
- భారత ఎగుమతులకు 99% పై జీరో సుంకం ప్రయోజనం
- దిగుమతి సుంకాలపై స్థిరీకరణ..
- బ్రిటన్‌కు చౌకగా లభించే భారతీయ ఉత్పత్తులు
- ద్వైపాక్షిక వాణిజ్యంలో $25.5 బిలియన్ పెరుగుదల అంచనా
- ఉద్యోగం, సేవల మార్పిడి పై సౌలభ్యం
- 2030 నాటికి వాణిజ్యం రెట్టింపు అంచనా.. జీడీపీ, వేతనాల్లో వృద్ధి..
- సామాజిక భద్రతా ఒప్పందం.. యూకేలో భారతీయులకు మూడు సంవత్సరాల మినహాయింపు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

భారత్, యూకే మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ఫోన్ సంభాషణ అనంతరం భారత ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక ఒప్పందంపై ప్రకటన చేశారు. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో పాటు, సామాజిక భద్రతా ఒప్పందం ఖరారైనట్లు ఆయన వెల్లడించారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఈ ఎఫ్‌టీఏ డీల్ ఓ మైలురాయిగా అభివర్ణించారు. దీనివల్ల ఇరుదేశాలకు లాభదాయకమన్నారు. మరోవైపు బ్రిటన్ ప్రధాని స్టార్మర్ భారత్‌లో పర్యటన కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల మధ్య గత మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. బోరిస్ జాన్సన్ ప్రధానిగా ఉన్నప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఈ చర్చలు జరుగుతున్నాయి. తాజాగా ఈ డీల్ కుదిరింది.

మిగతా 2లో..

# తెలంగాణ ఆర్టీసీ సమ్మె వాయిదా

## ప్రభుత్వ హామీలతో ఉద్యోగ సంఘాల వెనకడుగు

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో చర్చలు
- చర్చల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు: రామ్మోహన్ రెడ్డి, కోదండరాం, సాంబశివరావు
- యూనియన్లపై ఆంక్షల తొలగింపు, ఖాళీల భర్తీ
- కారుణ్య నియామకాలు, గుర్తింపు ఎన్నికలు
- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్, వేతన సవరణ, ఎలక్ట్రిక్ బస్సుల నేరుగా కొనుగోలు
- ముగ్గురు ఐఏఎస్‌లతో కమిటీ: లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్
- వారంలోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు
- 2019 సమ్మె సమయంలో నమోదైన కేసుల ఉపసంహరణ
- ప్రభుత్వంలో విలీనంపై చర్చలు కొనసాగింపు
- సచివాలయం మీడియా పాయింట్ వద్ద జేఏసీ ప్రకటన
- డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని హామీ





(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె వాయిదా పడింది. రేపటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జేఏసీ నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉంటారు. కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి వారంలోగా పరిష్కారం చూపాలని సర్కార్ ఆదేశాలిచ్చింది. తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న ఆర్టీసీని సమ్మె ద్వారా దెబ్బతీయవద్దని కోరింది. అలా కాకుండా మొండిగా సమ్మెకు దిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు చేయడం నిషేధం. ఇదిలా ఉంటే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగ సంఘాలు సమ్మెను వాయిదా వేసుకున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రభుత్వంతో సుధీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని ప్రకటించారు. పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులతో అనేక అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ యూనియన్ లపై ఆంక్షల తొలగింపు, అన్ని కేటగిరీల్లో ఖాళీ భర్తీ, గుర్తింపు ఎన్నికల నిర్వహణ, కారుణ్య నియామకాలు , ఉద్యోగ భద్రతపై సర్క్యులర్, నేరుగా ఆర్టీసీకే ఎలక్ట్రిక్ బస్సులు, 2025 నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపులు, 2017లో రిటైర్ అయిన వారికి వేతన సవరణ ప్రకారం బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే 2019 లో సమ్మె కాలంలో ఉద్యోగులపై వేసిన పోలీస్ కేసులను మాఫీ, ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం చేయాలని కోరినట్లు వెల్లడించారు. తమ అని డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పహల్గాం దాడి తర్వాత

# దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్లుకు భారత్ సిద్ధం

- ఆపరేషన్ అభ్యాస్: దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ ఆదేశాలు
- మాక్ డ్రిల్ లక్ష్యం: ప్రజలలో అవగాహన – సమన్వయం – సురక్షత
- డ్రిల్‌లో శిక్షణ అంశాలు: సైరన్ ప్రాముఖ్యత, రెస్క్యూ పద్ధతులు
- డాల్ సరస్సులో ఎన్డీఆర్ఎఫ్ ప్రాక్టీస్: పడవ ప్రమాదాలపై మాక్ డ్రిల్
- 1971 తర్వాత దేశవ్యాప్తంగా ఇటువంటి మాక్ డ్రిల్ మొదటిసారి
- తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం ఎంపిక
- గ్రామస్థాయికి విస్తరిస్తున్న మాక్ డ్రిల్: భాగస్వాములుగా విద్యార్థులు, వాలంటీర్లు
- అత్యవసర పరిస్థితుల్లో స్పందనపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

పహల్గాం దాడి వెనుక పాకిస్తాన్ ఉందని "అనుమానిస్తున్న భారత్.. ఆ దేశానికి గట్టిగా బదులి చ్చేందుకు అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్తో ప్రధాని మోదీ మంగళవారం మరోసారి భేటీ అయ్యారు. కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహవరించాలి అనేదానిపై దేశ ప్రజలను సమాయత్తం చేసేందుకు బుధవారం 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సోమవారం ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో మాక్ డ్రిల్ నిర్వహణపై ఆ శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం కీలక మీటింగ్ జరిగింది. ఇందులో సివిల్ డిఫెన్స్, ఎన్డీఆర్ఎఫ్ డీజీలు, ఎన్డీఎంఏ అధికారులు పాల్గొన్నారు. సీఎస్లతో గోవింద్ మోహన్ వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. మాక్ డ్రిల్స్పై రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలకు దిశానిర్దేశం చేశారు. శత్రువులు దాడి చేస్తే మనకు మనం ఎలా కాపాడుకోవాలి? ఈ సమయంలో విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలనే దానిపై అవగాహన కల్పించాలని సూచించారు.

కేంద్రం ఆదేశాల మేరకు మాక్తేల్ నిర్వహించేం దుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సిద్ధమ "య్యాయి. 1971 తర్వాత ఆ స్థాయిలో మళ్లీ నేడు దేశవ్యాప్తంగా తొలిసారి మాల్డ్రిల్ జరగనున్నది. హోం మంత్రిత్వ శాఖ ప్రకారం.. దేశంలోని 244 జిల్లాల్లో ఈ డ్రిల్ నిర్వహిస్తారు. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లోని జిల్లాలు ఇందులో ప్రధానంగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విశాఖపట్నాన్ని మాక్ డ్రిల్ కోసం ఎంపిక చేశారు. ఇందులో అధికా రులతోపాటు సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వలంటీర్లు, హోంగార్డులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రాలు (ఎన్వైకేఎస్), కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను భాగస్వాముల్ని చేయనున్నారు. ఈ డ్రిల్ను గ్రామస్థాయి వరకు నిర్వహించాలని కేంద్రం హోం శాఖ ప్లాన్ చేసింది. ఏదైనా ఎమర్జెన్సీ పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు, అధికారులు ఎలా వ్యవహరించాలనేదానిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కేంద్రం ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్ లోని దాల్ సరస్సులో ఎన్డీఆర్ఎఫ్ బృందం మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించింది. పడవ బోల్తాపడ్డప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై కసరత్తు చేసింది. పర్యాటకులు లేదా స్థానికులు ఉన్న పడవ ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు రెస్క్యూ ఆపరేషన్ ఎలా చేయాలనేది ప్రాక్టీస్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలేకాదు.. అత్యవసర పరిస్థితులలాంటి ఏ సవాళ్లు ఎదురైనా తాము సిద్ధమని ప్రదర్శన ద్వారా వెల్లడించారు.

ఈ మాక్ డ్రిల్ను యుద్ధం లేదా ఎయిర్లైక్స్ లాంటి అత్యవసర పరిస్థితుల్లో పౌరులను సన్నద్ధం చేయడానికి, భద్రత, సమన్వయం, అవగాహన పెంచడంకోసం నిర్వహిస్తారు. శత్రుదేశపు ఫైటర్ జెట్లు, మిసైల్స్, డ్రోన్లు దూ సుకొస్తే ఏం చేయాలనేదానిపై ప్రజలకు శిక్షణ ఇస్తారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది. ఈ డ్రిల్‌లో గగనతల దాడులు జరిగినప్పుడు ప్ర జలను అప్రమత్తం చేయడంలో సైరన్లు ఎంత ప్రభావవంతంగా ఉన్నాయో అంచనా వేస్తారు.

వైమానిక దాడి జరిగినప్పుడు వేగంగా, సురక్షితంగా స్పందించడానికి శిక్షణ ఇస్తారు. సివిల్ అధికారులు, భారత వైమానిక దళం మధ్య హాట్ లైన్, రేడియో కమ్యూనికేషన్ను వినియోగంలోకి తెస్తారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్స్, షాడో రూమ్స్ పని తీరును చెక్ చేస్తారు. శత్రు దాడుల సమయంలో సివిల్ డిఫెన్స్ టెక్నిక్స్ తమను తాము రక్షించుకునేలా విద్యార్థులు సహా ప్రజలందరికీ శిక్షణ ఇస్తారు. బ్లాకౌట్స్ సమయంలో తీసుకోవాల్సిన చర్యల ను నేర్పిస్తారు. ఎయిర్రైడ్ సమయంలో లైట్లు స్విచ్ఛాఫ్ చేయాలని కోరుతారు.. వైమానిక స్థావరాలు, రైలు యార్డులు, రిఫైనరీ లు వంటి కీలకమైన మౌలిక సదుపాయాలను దాడుల నుంచి రక్షించడానికి ప్రాక్టీస్ చేస్తారు. రెస్క్యూ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సం సిద్ధతను పరీక్షిస్తారు. ప్రమాద ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందు కు రిహార్సల్ చేస్తారు.

## టూరిజం, పెట్టుబడుల కోసం

# మిస్ వరల్డ్ పోటీలు – మంత్రి జూపల్లి

**మిస్ వరల్డ్ ఈవెంట్‌పై తప్పడు ప్రచారం చేస్తున్నారని జూపల్లి ధ్వజం**

**ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందని స్పష్టం**

**ఈ ఖర్చు కూడా తిరిగి ప్రభుత్వానికే వస్తుందని మంత్రి హామీ**

**ఫార్ములా ఈ రేసుపై తప్ప కాదు, నిబంధనలు ఉల్లంఘించిన ఖర్చులపైనే ఆక్షేపణ**

**బీఆర్ఎస్ విమర్శలపై మండిపడిన జూపల్లి**

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



టూరిజం ప్రమోషన్, పెట్టుబడుల ఆకర్షణ కోసమే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఏబీఎన్ఆంధ్రజ్యోతితో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచానికి చూపిస్తామన్నారు. అయితే మిస్ వరల్డ్ పోటీలపై కొందరు రాజకీయ కోణంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలు ఏ కోణంలో చూస్తే అలా కనిపిస్తాయని.. ఈ ఈవెంట్‌కు వందల కోట్లు ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే రూ.5 కోట్లు కూడా తిరిగి ప్రభుత్వానికి వస్తాయని తెలిపారు.

అలాగే తాము ఫార్ములా ఈ రేసును కూడా తప్పు పట్టలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన కోట్ల రూపాయల చెల్లింపులను తప్పు పట్టామని స్పష్టం చేశారు. మమ్మల్ని విమర్శించడమే బీఆర్ఎస్ పని అంటూ మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్‌రావుకు రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో పంటలు ఎండినా రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తాము పరిహారం ఇచ్చామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో తరుగు పేరిట రైతులను దళారులు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసే విమర్శల్లో పసలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

మరోవైపు మిస్ వరల్డ్ పోటీల కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మిస్‌వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. ప్రపంచంలోని ముద్దుగుమ్మలకు భాగ్యనగరం వేదికకానుంది. భాగ్యనరానికి విదేశీ అతిథుల రాక పెరిగింది. కంటెస్టెంట్‌లు, అతిథుల రాకతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సందడిగా మారింది. పోటీలో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి అందాల భామలు నగరానికి తరలివస్తున్నారు. వారికి ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈరోజు (మంగళవారం) మిస్ ఫ్రాన్స్ అగథాలో కాయేట్ హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రమయంలో మిస్ ఫ్రాన్స్ అగథాలో కాయేట్‌కు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో అధికారుల బృందం స్వాగతం పలికింది. మరోవైపు పోటీలు నిర్వహించే ప్రదేశాలతో పాటు చారిత్రక ప్రాంతాలను అందంగా ముస్తాబు చేశారు. విమానాశ్రయం, హోటల్స్ వద్ద తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. విదేశీయులు విడిది చేసే హోటల్‌స్‌ను అందంగా ముస్తాబు చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 3989 మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతి

- ఇకపై మెయిన్ అంగన్వాడీ టీచర్లతో సమాన వేతనం
- వేతనంలో భారీ పెరుగుదల – రూ.7,800 నుంచి రూ.13,650
- సాంకేతిక, న్యాయపరమైన సమస్యలతో ఆలస్యం – ప్రభుత్వం వివరణ

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



రాష్ట్రంలోని మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3989 మంది మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇకపై మినీ అంగన్వాడీ టీచర్లు కూడా మెయిన్ అంగన్వాడీ టీచర్లతో సమానంగా వేతనం అందుకోనున్నారు. ఇన్నాళ్లుగా మినీ అంగన్వాడీ, మెయిన్ అంగన్వాడీ అనే వేతన వ్యత్యాసం ఉండేది. అయితే, ఈ తాజా నిర్ణయంతో ఆ తేడా ఇకపై తొలగిపోనుంది. అందరూ ఇకపై అంగన్వాడీ టీచర్లుగానే పిలువబడతారు. సాంకేతికపరమైన సమస్యలు, అలాగే కొన్ని న్యాయపరమైన చిక్కుల కారణంగా ఈ ప్రక్రియ ఇంతకాలం ఆలస్యమైందని ప్రభుత్వం తెలిపింది. అయితే, అన్ని అడ్డంకులను అధిగమించి ఈ నెల నుంచే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. అంతేకాకుండా, మే నెల నుంచి మినీ అంగన్వాడీ టీచర్లకు క్రమం తప్పకుండా నెలకు రూ.13,650 వేతనం అందనుంది. గతంలో మినీ అంగన్వాడీ టీచర్లకు నెలకు కేవలం రూ. 7800 మాత్రమే వేతనంగా వచ్చేది. ఈ పెంపుతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడనుంది. ఎలాంటి సమస్యలు లేకుండా ఈ విషయాన్ని పరిష్కరించి, ఇక నుంచి తమకు ప్రతి నెలా మెయిన్ అంగన్వాడీ టీచర్ల మాదిరిగానే వేతనాలు అందేలా కృషి చేసిన మంత్రి సీతక్కకు మినీ అంగన్వాడీ టీచర్లు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## భారత్-యూకే చారిత్రాత్మక

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

భారత్ యుకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ ఒప్పందంలోని ముఖ్యమైన అంశాలు ఇవే!

99 శాతం భారతీయ ఎగుమతులు యూకే మార్కెట్లో జీరో సుంకం వల్ల ప్రయోజనం పొందుతాయి.

భారత ఉత్పత్తులపై దిగుమతి సుంకం తగ్గుతుంది. 90 శాతం ఉత్పత్తులపై తగ్గించిన సుంకాలు లాక్ అవుతాయి. వీటిలో 85 శాతం భారతీయ ఉత్పత్తులు ఓ దశాబ్దంపాటు పూర్తిగా సుంక రహితంగా ఉంటాయి.

విస్కీ, జిన్‌లపై సుంకాలు 150 శాతం నుంచి 75 శాతానికి తగ్గిస్తారు. ఆ తరువాత ఒప్పందం జరిగిన పదేళ్లలో వీటిపై సుంకాలు 40 శాతానికి తగ్గిస్తారు.

ఆటోమోటివ్ సుంకాలు కోటా కింద 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గుతాయి.

సౌందర్య సాధనాలు, ఏరోస్పేస్ , ల్యాంబ్ , వైద్య పరికరాలు, సాల్మన్ , విద్యుత్ యంత్రాలు, శీతల పానీయాలు, చాక్లెట్లు, బిస్కెట్లపై కూడా సుంకాలు తగ్గుతాయి. దీని వల్ల భారతీయ వ్యాపారులకు చాలా మేలు చేకూరనుంది.

యూకే సుంకాలు సరళీకరించిన నేపథ్యంలో బ్రిటీష్ వారికి దుస్తులు, పాదరక్షలు, ఘనీభవించిన రొయ్యలు వంటి ఆహార ఉత్పత్తులు చౌకగా లభిస్తాయి.

భారత్, యూకేల మధ్య కుదిరిన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల దీర్ఘకాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 25.5 బిలియన్లు మేర పెరగవచ్చు. అలాగే యూకే జీడీపీ 4.8 బిలియన్లు, వేతనాలు 2.2 బిలియన్ల మేర పెరగవచ్చని అంచనా.

ఈ డీల్ వల్ల వస్త్రాలు, సముద్ర ఉత్పత్తులు, తోలు, పాదరక్షలు, క్రీడా వస్తువులు, బొమ్మలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ఇంజిన్లు, సేంద్రియ ఎరువులు లాంటి రంగాలకు ఎగుమతి అవకాశాలు పెరుగుతాయి.

ఐటీ/ITeS, ఆర్థిక, విద్య, వృత్తి పరమైన, ఇతర వ్యాపార సేవలకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుంది.

యూకేలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులకు సామాజాకి భద్రతా చెల్లింపుల నుంచి మూడేళ్ల పాటు మినహాయింపు లభిస్తుంది.

ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి యూఎస్‌డీ 60 బిలియన్ డాలర్ల నుంచి రెట్టింపు అవుతుందని అంచనా.

ఎఫ్‌టీఏ వల్ల కాంట్రాక్ట్ సర్వీస్ సరఫరాదారులు, బిజినెస్ విజిటర్లు, పెట్టుబడిదారులు, ఇంట్రాకార్పొరేట్ బదిలీదారులు, యోగా బోధకులు, సంగీతకారులు, చెఫ్‌లు లాంటి వారు సులువుగా యూకే వెల్లడానికి వీలవుతుంది.

ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, కంప్యూటర్, టెలికమ్యునికేషన్ సేవలు లాంటి డిజిటల్ సేవల విషయంలో భారత్‌కు లబ్ధి చేకూరుతుంది.

డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ కింద యూకేలో తాత్కాలికంగా ఉన్న భారతీయ కార్మికులు, వారి యజమానులు మూడేళ్లపాటు సామాజిక భద్రతా చెల్లింపుల నుంచి మినహాయింపు పొందుతారు. దీని వల్ల యూకేలో భారతీయుల పోటీతత్వం పెరుగుతుంది.

వస్తు, సేవల స్వేచ్ఛా వాణిజ్యం వల్ల భారతీయ ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుంది. నాన్‌టారిఫ్ అడ్డంకులు తొలగిపోతాయి.

# గాలి బీభత్సం బాధితులను పరామర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే

పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :

పాలకుర్తి మండల కేంద్రంలో గాలి బీభత్సం కారణంగా కిరాయి ఇంటిలో నివాసముంటున్న రాపర్తి లక్ష్మి, భర్త రామచంద్రయ్య తీవ్రంగా బాధపడ్డారు. గత కొన్ని రోజులుగా కిరాయికి ఓ చిన్న ఇంటిలో నివసిస్తున్న ఈ కుటుంబానికి, రాత్రి వచ్చిన బలమైన గాలికి ఇంటి పై భాగంలో ఉన్న రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి. విషయం తెలుసుకున్న పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి బాధిత కుటుంబాన్ని వెంటనే పరామర్శించారు. ఎమ్మెల్యే వారి నివాసానికి స్వయంగా వెళ్లి, రాపర్తి లక్ష్మీ ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని పూర్తిగా తెలుసుకున్నారు. తక్షణ సహాయం కింద ఎమ్మెల్యే స్వయంగా నిత్యావసర సరుకులు కొనిచ్చి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబాన్ని ఓదార్చుతూ, ప్రభుత్వం వారి సంక్షేమానికి అంగీకరంగా ఉన్నదని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాపర్తి లక్ష్మీకి ఇప్పటి వరకు ఇంటి స్థలం లేకపోవడం వల్ల డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరవలేదు. అయితే తదుపరి విడతలో ప్రభుత్వం ద్వారా ఆమెకు ఇంటి స్థలం మంజూరు చేయించి, డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలెవరూ ఒంటరిగా ఉండకుండా చూడటమే మా బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి భార్గవ్, పట్టణ అధ్యక్షులు నాగన్న, మాజీ సర్పంచ్ యకంత రావు, మండల యూత్ అధ్యక్షులు హరీష్, రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బాధిత కుటుంబం ఎమ్మెల్యే చర్యలను చూసి హర్షం వ్యక్తం చేస్తూ, వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :

పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి, వారి నుంచి నేరుగా సమాచారం తెలుసుకున్నారు. ఈ తనిఖీ సమయంలో అక్కడ ఉన్న రైతులు ఎమ్మెల్యేకి తమ సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతున్నదని, మిల్లులకు ధాన్యం తరలించడానికి అవసరమైన లారీలు అందుబాటులో లేవని వారు చెప్పారు. దీనిపై స్పందించిన శ్రీమతి యశస్విని రెడ్డి తక్షణమే జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషాతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని వివరించారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టం వృథా కాకూడదు, ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. లాజిస్టిక్స్ సమస్యల వల్ల రైతులు ఇబ్బంది పడకూడదు అని కలెక్టర్ తో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాను అని అన్నారు. వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలి అని, ధాన్యాన్ని తడి కాకుండా కాపాడుకోవడం అవసరం రైతులకు ఉందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా అధికారులను ఆదేశించారు. అదనంగా, వారు అధికారులను ఆలస్యం కాకుండా, ఖచ్చితమైన పద్ధతిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. రైతులు ఎటువంటి అవినీతిని సహించవద్దని, ఏదైనా సమస్య ఎదురైతే తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ తనిఖీతో గ్రామస్థుల్లో, రైతుల్లో విశ్వాసం పెరిగిందని, ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన నిలబడతానని వారు హామీ ఇచ్చారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం-07- మే 2025
వరంగల్












**PRESS RELEASE:**

**OPERATION SINDOOR : INDIAN ARMED FORCES CARRIED OUT PRECISION STRIKE AT TERRORIST CAMPS**

Posted On: 07 MAY 2025 1:44AM by PIB Delhi

A little while ago, the Indian Armed Forces launched 'OPERATION SINDOOR', hitting terrorist infrastructure in Pakistan and Pakistan-occupied Jammu and Kashmir from where terrorist attacks against India have been planned and directed.

Altogether, nine (9) sites have been targeted.

Our actions have been focused, measured and non-escalatory in nature. No Pakistani military facilities have been targeted. India has demonstrated considerable restraint in selection of targets and method of execution.

These steps come in the wake of the barbaric Pahalgam terrorist attack in which 25 Indians and one Nepali citizen were murdered. We are living up to the commitment that those responsible for this attack will be held accountable.

There will be detailed briefing on 'OPERATION SINDOOR', later today.

# ఆపరేషన్ సిందూర్



**(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)**

పహల్గాం ఉగ్రదాడి తో భారత్, పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. మంగళవారం అర్ధరాత్రి 1:44 గంటలకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్రమౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న మొత్తం తొమ్మిది స్థావరాలపై దాడులు జరిపింది. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు ఇండియన్ ఆర్మీ పేర్కొంది. ఉద్రిక్త పరిస్థితులకు తావులేకుండా.. పాక్ సైనిక సదుపాయాలపై ఎక్కడా దాడులు చేపట్టలేదని భారత ప్రభుత్వం పేర్కొంది. దేశ వ్యాప్తంగా బుధవారం కేంద్ర ప్రభుత్వం మాక్ డ్రిల్స్ నిర్వహించనున్న వేళ ఈ దాడులు చేయడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పహల్గాం దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచేందుకు కట్టుబడి ఉన్నామని భారత్ వెల్లడించింది. దాడులకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని రక్షణశాఖ ప్రకటించింది. భారత ప్రభుత్వం ప్రకటన అనంతరం ఇండియన్ ఆర్మీ స్పందించింది. 'న్యాయం జరిగింది' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. మెరుపు దాడులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే దాడులు చేపట్టిన ప్రాంతాలకు సంబంధించిన వివరాలను భారత్ సైన్యం ఇంకా వెల్లడించలేదు. టెర్రరిస్టు గ్రూప్ లష్కరే తొయిబాకు మురిడ్కే హెడ్ క్వార్టర్స్‌గా ఉంది. ఇక పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్పూర్‌లో మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ ఎ మహ్మద్ స్థావరం ఉంది. ఆపరేషన్ సిందూర్‌పై పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు.

**మెరుపు దాడులపై స్పందించిన పాక్ ప్రధాని**

మరోవైపు భారత్ దాడులను పాక్ సైన్యం ధ్రువీకరించింది. పాక్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ స్పందించారు. పాక్‌లోని కొట్లీ, మురిడ్కే, బహవల్పూర్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు చనిపోయారని, 12 మందికి గాయాలైనట్టు పాక్ ఆర్మీ పేర్కొంది. ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. "మోసపూరిత శత్రువు పాకిస్థాన్‌లోని 5 ప్రాంతాల్లో దాడులు జరిపింది. ఈ చర్యలకు పాకిస్థాన్ కచ్చితంగా బదులు తీర్చుకుంటుంది. ఈ సమయంలో పాక్ సైన్యం వెంట దేశమంతా నిలబడి ఉంది. శత్రువును ఎలా ఎదుర్కోవాలో పాకిస్థాన్, ఆర్మీకి తెలుసు. ప్రత్యర్థి దుష్ట ప్రణాళికలను ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేరనీయం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని ప్రకటన తర్వాత.. సరిహద్దులోని పూంఛ్, రాజౌరి సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు ప్రారంభించింది.

**అప్రమత్తమైన పాక్..**

భారత్ దాడులతో పాక్ అప్రమత్తమైంది. లాహోర్, సియాల్‌కోట్ ఎయిర్‌పోర్ట్‌లను 48 గంటల పాటు మూసివేసింది. భారత్ ప్రతీకార దాడుల చేపట్టిన అనంతరం భారత భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ అమెరికా భద్రతా సలహాదారు మార్కో రూబియోతో మాట్లాడారు. దాడుల సమాచారాన్ని ఆయనకు వివరించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం 'భారత్ మాతా కీ జై' పేరుతో పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. దాడుల అనంతరం భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. పాక్ నుంచి ఎలాంటి ప్రతిస్పందన ఎదురైనా.. నిలువరించేందుకు సరిహద్దుల వెంట ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు మోహరించాయి.







తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# నిబంధనల ప్రకారం అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు......

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

నిబంధనల ప్రకారం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయింపు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.

పైలెట్ గ్రామాలలో 878 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే, 409 ఇండ్లు బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించామని, 370 లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత లక్ష రూపాయల ఆర్థిక సహాయం విడుదల చేసిందని అన్నారు. మిగిలిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు.

మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన ఇళ్ల పురోగతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేసే ముందు సంబంధిత లబ్దిదారులకు, మేస్త్రీలకు మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను చూపించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటిని ఎలా నిర్మించుకోవాలో హౌజింగ్ శాఖకు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన అసిస్టెంట్ ఇంజనీర్ ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

మండల కేంద్రాలలో జరుగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి వివరాలు ప్రతి వారం రిపోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం 4 విడతల్లో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తుందని, మొదటి విడత పెట్టుబడి పెట్టలేని నిరుపేదలు ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలని, పైలెట్ ప్రాజెక్టు లో దాదాపు 300 పైగా పేదలకు అందించామని అన్నారు.

ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో చర్చించి త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని, డబ్బు సమస్య ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శి ఫోటో తీసి అప్ లోడ్ చేస్తారని, వీటిని అసిస్టెంట్ ఇంజనీర్, డీ.ఈ. క్షేత్ర స్థాయిలో ధ్రువీకరణ చేస్తారని, జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి వెళ్లి లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతాయని అన్నారు.

వివాదాలకు తావు లేకుండా లబ్దిదారుల జాబితా ఎంపిక చేయాలని, ఖమ్మం జిల్లాలో డబ్బులు లేని కారణంగా గ్రౌండ్ చేయకుండా ఎవరు వేచి చూసేందుకు వీలు లేదని కలెక్టర్ తెలిపారు. గ్రామాల వారీగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి అవసరమైన వారికి డ్వాక్రా రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఖమ్మం జిల్లాకు 14 వేల 763 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తే, 10 వేల 921 దరఖాస్తులు సర్వే చేసి 9 వేల 150 దరఖాస్తులకు అర్హత ఉందని తేలిందని తెలిపారు. తుది లబ్దిదారుల జాబితా ర్యాండమ్ గా చెక్ చేసి అర్హులకు మాత్రమే జాబితాలో చోటు కల్పించారా లేదా గమనించి వివరాలు అందించాలని అన్నారు. ర్యాండమ్ చెక్ పూర్తి చేసుకున్న తర్వాత ఎంపిక చేసిన అర్హుల జాబితాను ఆమోదం తీసుకొని గ్రౌండ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే ఇళ్ల కేటాయింపు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, ఈఈ హౌసింగ్ బి. శ్రీనివాస్, డిఇఓ సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ కల్లూరు రాంచందర్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సకాలంలో పూర్తి చేయాలి...

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు.

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని 46వ డివిజన్, జూబ్లీపురాలో 33.95 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సిసి డ్రైన్స్, కల్వర్ట్ నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అధికారులతో పాటు ప్రజలపై ఉందన్నారు.

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు ప్రజాప్రతినిధులు నిరంతరం పరిశీలన చేయాలని, లోటుపాట్లు ఉంటే, కమిషనర్ దృష్టికి తేవాలని అన్నారు. నగరాన్ని సుందర, స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుటకు అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి పాలనపై మైస ఉపేందర్ మాదిగ ఆగ్రహం

- అంబేడ్కర్ అభయ హస్తం అటకెక్కింది
- మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శ

ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకే పరిమితమైచేస్తున్న పాలనపై మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ తీవ్రంగా మండిపడ్డారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 17 నెలలుగా ప్రభుత్వం ఏర్పడినా దళితుల అభివృద్ధికి కనీస గమనిక కనిపించడంలేదన్నారు. "ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉంది" అన్నట్టుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని విమర్శించారు.

"అంబేడ్కర్ అభయ హస్తం" పేరుతో ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది తప్ప దాన్ని అమలు చేసే చిత్తశుద్ధి లేదు అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన దళితబంధు లబ్ధిదారులకు ఇప్పటికీ నిధులు విడుదల కాలేదని, వెంటనే వాటిని అందించాలని డిమాండ్ చేశారు.

అలాగే, మాదిగలకు మంత్రి పదవులు లేకపోవడాన్ని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. దళితుల ఆర్థిక అభివృద్ధిని మాటలకే పరిమితం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలే తీర్పు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యమైన డిమాండ్లు:

1.రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రేషన్ కార్డు సంబంధం లేకుండా అందుబాటు లోకి తేవాలి.

2.సిబిల్ స్కోర్ లేకున్నా, నాన్‌లింక్డ్ స్కీమ్ ద్వారా అర్హులైన దళితులకు పథకం ప్రయోజనం అందించాలి.

3.సాధ బైనామ ద్వారా భూములు పొందిన రైతులకు ఉచితంగా పట్టాల పంపిణీ చేయాలి.

తెలంగాణ సాధనకు దారి చూపిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తిని తుంచేయకుండా, అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలన్నారు.




# విద్యార్ధులు సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, ఇతరులకు తోడ్పాటు అందించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని వెనుకబడిన తరగతుల బాలుర, బాలికల కళాశాలల వసతి గృహములలో 202425 సంవత్సరములో ఇంటర్మీడియెట్ చదువుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్టస్థాయి ర్యాంక్ లు సాధించిన విద్యార్థులను కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇంటర్ లో సి.హెచ్. త్రివిక్రమ్ 958/1000, కె. రేష్మ 957/1000 మార్కులు సాధించినందుకు, మెమెంటో తో పాటు ఒక్కొక్కరికీ పది వేల రూపాయిల చొప్పున ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ గొప్ప స్థాయికి చేరుకోవాలని అన్నారు. చిన్న వయస్సులోనే పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఒక్కో మెట్టు ఎక్కుతూ, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని, ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, క్రీడాకారులుగా, వివిధ రంగాలలో పెద్ద స్థాయికి చేరుకోవాలని సూచించారు.

మనం ఎదిగే క్రమంలో అనేక మంది నిరుత్సాహపరుస్తారని, దొరికిన దానితో సంతృప్తి చెందమని సలహాలు అందిస్తారని, మనం నిర్దేశించుకున్న లక్ష్యం దిశగా ప్రణాళిక ప్రకారం క్రమపద్ధతిలో పనిచేస్తూ వెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కె. రవిబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జనగాం డిఇఓ దర్శనం భోజన్‌ని సన్మానించిన చిరంజీవి నాయక్

జనగాం, తెలంగాణ ముచ్చట్లు:

జనగాం జిల్లా విద్యాశాఖ అధికారిగా తాజాగా(డీఈఓ) బాధ్యతలు స్వీకరించిన దర్శనం భోజన్‌ని ఘనంగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బిఆర్ఎస్వీ ఇంచార్జీ లకావత్ చిరంజీవి ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు .ఈ సందర్భముగా పూల బొకే అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ....."ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక ఫర్నీచర్, మెరుగైన తరగతి గది వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వీటిని త్వరగా తీర్చిదిద్దాలి. సరిపడని ఫర్నీచర్‌ను సమకూర్చి, తరగతి గదులను విస్తరించడం ద్వారా విద్యామానవ వనరుల సృజనాత్మక భావనకు నాంది పలకాలి."

"ప్రైవేట్ పాఠశాలలు అనుమతిపరమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. అర్హత లేని ఉపాధ్యాయులతో 'టెక్నో', 'డిజిటల్', 'స్పెషల్' తరగతులు నిర్వహిస్తూ అధికంగా ప్రచారం చేస్తున్నారు. పాఠశాల పరిధిలోనే పాఠ్యపుస్తకాలు, నోట్స్, యూనిఫార్మ్, బ్యాగ్‌ల విక్రయాన్ని నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలి." "ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, గ్రామీణ-నగర ప్రాంతాలన్నింటిలో విద్యారంగ అభివృద్ధికి మానిటరింగ్ వ్యవస్థను బలపరిచుకోవాలని కోరుతున్నాను."ఈ కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి గుగులోతు చంద్రభాను, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. అన్ని స్టేక్‌హోల్డర్లు కలిసి విద్యా వ్యవస్థలో మెరుగుదలకు పూర్తి సహకారం అందించాలని అంగీకరించారు.





# బాధిత కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సెక్షన్ సూపరిండెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన యండీ. హనీఫ్ కుటుంబ సభ్యులకు రూ.14,98,610/ భద్రత ఎక్స్‌గ్రేసియా చెక్కు ను మంగళవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

- తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు.
- బోనకల్ మండలం సీతానాగారం, తూటికుంట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు.

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:




భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నంచందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. మంగళవారం బోనకల్ మండలం సీతానాగారం, తూటికుంట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్ధం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సీతానాగారం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 29, తూటికుంట్ల గ్రామ రెవెన్యూ సదస్సులో 91 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాల విడుదలకు కృషి చేసిన సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగుల

- ఉద్యోగుల తరపున ధన్యవాదాలు తెలిపిన జేఏసీ నాయకులు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:



గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కో చైర్మన్ మైదరి మోహన్ రావు, చైర్మన్ ఎలబద్రి లింగయ్య మాట్లాడుతూ “మన శాఖకు చెందిన సుమారు 12500 మంది ఉద్యోగులు గత నాలుగు నెలలుగా జీతాలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశాన్ని మేము జేఏసీ తరపున మంత్రి సీతక్కకి వివరించాం. తక్షణమే స్పందించిన మంత్రి సీతక్క, ఆర్థిక శాఖా మంత్రి బట్టి విక్రమార్క, ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు, ప్రిన్సిపాల్ సెక్రటరీ లోకేశ్ కుమార్, కమిషనర్ లతో పలుమార్లు చర్చించి రాష్ట్ర బడ్జెట్ నుండి రెండు దఫాలుగా 114 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు.”

ఈ నిధుల ద్వారా ఉద్యోగులకు జీతాలు అందడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, సీతక్కలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో ఉద్యోగుల పే స్కేల్ అంశాన్ని కూడా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్టు నేతలు పేర్కొన్నారు. సీతక్క ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎం. మోహన్ రావు, అఖిల భారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు, జేఏసీ కో చైర్మన్, ఎపిఓఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎలబద్రి లింగయ్య, జేఏసీ చైర్మన్, పలువురు ఉద్యోగ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# కార్బైడ్ రహిత మామిడి పండ్లను కొనుగోలు చేయాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రోటరీనగర్ మామిడి పండ్ల మార్కెట్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:



వేసవికాలం వచ్చిందంటే పండ్లలో పలువురు మామిడికాయల వైపు చూస్తారు. రోటరీ నగర్ లోని కార్బోరహిత మామిడి పండ్ల మార్కెట్ ను వినియోగదారులు, రైతులు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

మంగళవారం జిల్లా కలెక్టర్, రోటరీనగర్ లో ఏర్పాటు చేసిన కార్బైడ్ రహిత మామిడి పండ్ల మార్కెట్ ను సందర్శించారు. స్టాల్ లో ఉంచిన పలు రకాల జాతుల మామిడి పండ్లను పరిశీలించారు. స్టాల్ నిర్వాహకులు రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. బయట మార్కెట్ లో పక్వానికి రాకముందే కార్బెట్ వేసి మగ్గబెట్టి, రసాయనాలలో కాయలు పండించి విక్రయిస్తున్నారని, ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని ఇక్కడ కార్బైడ్ రహిత పండ్లు అమ్ముకునే మార్కెట్ సౌకర్యం కల్పించినందుకు రైతులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సహజ సిద్ధంగా మాగిన మామిడి పండ్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని, ప్రస్తుత కాలంలో రసాయనాలు, మందులు, కార్బైడ్ వాడకంతో అనేక రకాల వ్యాధులు అల్సర్, క్యాన్సర్ కాలేయ, మూత్రపిండ వ్యాధులు గురైవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మామిడి పండ్లను సహజ పద్ధతిలో మాగించిన పండ్లను విక్రయించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు.

మామిడి రైతు బజార్ లో రైతులు అందరికీ ఆరోగ్యాన్ని ఇచ్చే కార్బైడ్ రహిత మామిడి పండ్లను విక్రయించడానికి బంగినపల్లి, హిమాయత్, చిన్న రసాలు, పంచదార రసాలు, ముంత మామిడి రకాలు, పచ్చడి కాయలు కూడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

ఖమ్మం నగరం రోటరీ నగర్ లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30 పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్ ను నూతనంగా ఏర్పాటు చేశామని, స్టాల్ లలో రైతులు పండ్ల అమ్మకం చేపట్టారని, రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్ లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూస్తున్నామని తెలిపారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయించుకుంటారని కలెక్టర్ తెలిపారు.

రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందని, దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటివి రైతులు నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా పాలన....

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు

పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

మంగళవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామం ఎస్సీ కాలనీలో 52 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు, 6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పాలేరు గ్రామం సూర్యాపేట అశ్వరావుపేట రోడ్డు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, ఒక కోటి 50 లక్షలతో నిర్మించనున్న మారెమ్మ టెంపుల్ కేంద్రీయ విద్యాలయ రోడ్డు కరుణగిరి జంక్షన్ అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేసి, గోల్లపాడు గ్రామంలో 16 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సిసి రోడ్ల నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేసారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి ప్రాధాన్యత భావిస్తూ పాలన సాగిస్తుందని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రైతులకు 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్, ఉగాది నుండి సరఫరా చేస్తున్న సన్న బియ్యం సరఫరా, మొదటి విడత రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామాలలో సిసి రోడ్లు వేస్తున్నామని అన్నారు.

తరతరాల నుండి మనకు ఉన్న ఆస్తుల పట్ల గత ప్రభుత్వం ధరణి పేరుతో అభద్రత కల్పించిందని, రైతులకు ఉన్న భూ సమస్యలను అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి పరిష్కరించి భూ భద్రత కల్పించే దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

గత ప్రభుత్వం మన మీద అప్పుల భారం పెట్టినప్పటికీ ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి పనులు సైతం చేపట్టామని, పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు.

గోల్లపాడు గ్రామంలో రోడ్డు విస్తరణ పనులకు ఒప్పుకొని స్థలాలు కేటాయించిన ప్రజలకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం తరపున ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటామని అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పెద్దతండా వద్ద కళ్యాణలక్ష్మి పథక లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో కుమార్, సిపిఐ నాయకులు మహమ్మద్ మౌలానా మరియు ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

- రెండోసారి ఎన్నికైన గంటె ఉపేందర్ యాదవ్

చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:



చిల్పూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన గంటె ఉపేందర్ యాదవ్ ని పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కార్యకర్తలు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా గంటె ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ...

“నన్ను మరోసారి ఎన్నిక చేయడం పట్ల మండలంలోని కార్యకర్తలకు, నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్క కార్యకర్తతో కలిసి ముందుకెళ్తాం. గడిచిన కాలంలో మాదిరిగానే అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తాను” అని పేర్కొన్నారు. “బీజేపీని గ్రామ స్థాయిలో మరింత పటిష్టంగా నిలబెట్టేందుకు మనందరం కలిసికట్టుగా పనిచేయాలి. యువత, మహిళలు, రైతుల సమస్యలపై గళమెత్తే బలమైన వేదికగా బీజేపీ ఉండాలనే ఆశయం నాలో ఉంది” అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, జిల్లా నాయకులు భూక్య అనిల్ నాయక్, బీజేపీ వైయం మండల అధ్యక్షులు తోట రంజిత్, బూత్ అధ్యక్షులు దామెర ప్రశాంత్, దామెర వంశీ, కన్నెబోయిన అఖిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబై జోరుకు బ్రేక్



ఐపీఎల్-2025లో ముంబై ఇండియన్స్ జైత్రయాత్రకు కాస్త విరామం... వరుసగా ఆరు విజయాలతో కొనసాగించిన జోరుకు గుజరాత్ టైటాన్స్ బ్రేక్ వేసింది. మంగళవారం వాంఖెడే మైదానంలో జరిగిన పోరులో గుజరాత్ 3 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) ముంబైపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (35 బంతుల్లో 53; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 35; 5 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 43 బంతుల్లో 71 పరుగులు జోడించారు. చక్కటి బౌలింగ్‌తో ముంబైని తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో టైటాన్స్ సఫలమైంది. అనంతరం గుజరాత్ 19 ఓవర్లలో 7 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (46 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (27 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), రూథర్‌ఫర్డ్ (15 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో 14 ఓవర్ల తర్వాత 107/2తో గుజరాత్ మెరుగైన స్థితిలో నిలిచింది. చేతిలో 8 వికెట్లు ఉన్న జట్టు మరో 36 బంతుల్లో 49 పరుగులే చేయాలి. గుజరాత్ విజయం లాంఛనమే అనిపించింది. ఈ దశలో వానతో చాలా సేపు ఆట ఆగిపోయింది. అంతా చక్కబడి మ్యాచ్ మొదలైన తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.

బుమ్రా, బౌల్ట్ చెలరేగిపోవడంతో గుజరాత్ బ్యాటింగ్ తడబాటుకు లోనైంది. తర్వాతి 4 ఓవర్లలో 25 పరుగులు చేసిన జట్టు 16 బంతుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. 2 ఓవర్లలో 24 పరుగులు చేయాల్సిన ఉన్న సమయంలో మళ్లీ భారీ వర్షంతో ఆట ఆగిపోయింది. దాంతో ఆటను ఒక ఓవర్ కుదించి డక్‌వర్త్-లూయిస్ ప్రకారం గుజరాత్ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 147గా నిర్దేశించారు. దాంతో చివరి ఓవర్లో విజయానికి 15 పరుగులు అవసరమయ్యాయి. చహర్ వేసిన ఈ ఓవర్లో టైటాన్స్ 15 పరుగులు చేసి విజయాన్నందుకుంది.






తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వీరమల్లు వస్తే ఎవరికి టెన్షన్

హరిహర వీరమల్లు షూటింగ్ కు ముగింపుకొచ్చేసింది. సెట్స్ లో నిన్నటి నుంచి పవన్ కళ్యాణ్ హాజరు కావడంతో టీమ్ ఉత్సహంగా పరుగులు పెడుతోంది. మే ఎనిమిది లేదా తొమ్మిది తేదీల్లో గుమ్మడికాయ కొట్టడం దాదాపు ఫిక్స్. ఇక డబ్బింగ్ ఇతరత్రా కార్యక్రమాలు మూడో వారంలోగా పూర్తి చేయాలనేది టార్గెట్. ఇప్పుడు అసలు సవాల్ విడుదల తేదీ. మే 30 కింగ్ డమ్ ఉంది. ఒకవేళ అదే తేదీ కావాలనుకుంటే సితార సంస్థ వాయిదా వేసుకోవడానికి వెనుకాడదు. కాకపోతే వీలైనంత ముందుగా నిర్ణయం తీసుకుంటే దానికి అనుగుణంగా కొత్త డేట్ ఏది వేసుకోవాలో విజయ్ దేవరకొండ టీమ్ ప్లాన్ చేసుకుంటుంది. లేదూ వీరమల్లు జూన్ మొదటి వారంలో రావాలంటే కమల్ హాసన్ తగ్ లైఫ్ ఉంది. దాని వల్ల తెలుగు వర్షన్ కొచ్చిన ఇబ్బందేం లేదు కానీ తమిళనాడు, కేరళలో పవన్ సినిమాని మార్కెట్ చేసుకోవడం, థియేటర్లు దక్కించుకోవడం కష్టమవుతుంది. పైగా బజ్ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల వీరమల్లు ప్రమోషన్ల మీద దృష్టి పెట్టేందుకు అవసరమైనంత సమయం దక్కేలా చూసుకోవడం అవసరం. అలాంటప్పుడు కమల్ తో క్లాష్ ఎంతవరకు సేఫనేది రకరకాల సమీకరణాల మీద ఆధారపడి ఉంటుంది. అదే నెలలో కుబేర, కన్నప్పలు ఉన్నాయి. ఒకవేళ పవన్ వస్తానంటే నాగార్జున, మంచు విష్ణు ఎలా స్పందిస్తారో చూడాలి. ఎందుకంటే కన్నప్ప, కుబేరలు కూడా ఇప్పటికే విపరీతమైన జాప్యానికి గురయ్యాయి. ఇంతకన్నా లేట్ చేయడానికి లేదు. ఒకవేళ వీటిలో ఏదైనా లేదా హరిహరవీరమల్లు కనక జూన్ వద్దనుకుంటే మిగిలింది జూలై ఒక్కటే.



# ‘సిరివెన్నెల’కు న్యాయం చేయలేకపోయా

సిరివెన్నెల సీతారామశాస్త్రి అంటే త్రివిక్రమ్‌కు ఎంత అభిమానమో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఒక సినీ వేడుకలో ఆయన సిరివెన్నెల గురించి ఇచ్చిన స్పీచ్ ఎన్నో ఏళ్ల నుంచి యూట్యూబ్‌లో కోట్ల కొద్దీ వ్యూస్ తెచ్చుకుంటోంది. సిరివెన్నెల గురించి అంతకంటే గొప్పగా ఇంకెవరూ మాట్లాడలేరు అనిపిస్తుంది ఆ స్పీచ్ చూస్తే. అందులోని మాటలు కల్ట్ స్టేటస్ తెచ్చుకున్నాయి. ఇప్పటికీ మీమ్స్‌లో, సినిమా డైలాగుల్లో త్రివిక్రమ్ మాటల్ని విరివిగా వాడుతుంటారు. కాగా సిరివెన్నెల మరణానంతరం ఓ టీవీ ఛానెల్ నిర్వహిస్తున్న ‘నా ఉచ్ఛ్వాసం కవనం’ కార్యక్రమానికి తాజాగా అతిథిగా వచ్చిన త్రివిక్రమ్.. మరోసారి తన అభిమాన గేయ రచయిత గురించి గొప్పగా మాట్లాడారు. సిరివెన్నెల రాసిన అనేక పాటల గురించి విశ్లేషించే ప్రయత్నం చేసిన త్రివిక్రమ్.. ఆయన సాహిత్యానికి చాలామంది దర్శకులు న్యాయం చేయలేకపోయారని.. అందులో తాను కూడా ఒకడినని చెప్పారు. ‘జల్సా’లో బాగా పాపులర్ అయిన ‘ఛలోరే..’ పాట కోసం సిరివెన్నెల 30 వెర్షన్లు రాసినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ‘‘నువ్వే కావాలి సినిమాలో అనగనగా ఆకాశం.. పాట రాసేటపుడు శాస్త్రి గారితో నా అనుబంధం బలపడిరది. ఆయన రాసిన పాటలకు చాలామంది దర్శకులు న్యాయం చేయలేకపోయారు. నేను అయితే కచ్చితంగా న్యాయం చేయలేదనిపిస్తుంది. ఆయన పదాలకు సరిపడేలా చిత్రీకరించడం కుదరదు. అంత గొప్పగా ఉంటాయి. ఆయనకు సన్నివేశాన్ని వినిపించడానికి నాకు సిగ్గేసేది. ఆయన బాధ పడుతూ వినేవారు. కష్టంగా రాసేవారు. కానీ అందరూ ఆయన కంటే తెలివైన వారే అనుకుంటారు. ప్రేక్షకులకు అన్నీ తెలుసని వాళ్లను ఒప్పించాలి అనే భావనలో ఉండేవారు.






# శుభం విడుదలకు సిద్ధం

కథానాయికగా సమంత ‘శుభం’ సినిమాతో నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఆమె ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో ఈచిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ,’వైజాగ్‌కు వస్తే ప్రతీసారి సినిమా బ్లాక్‌బస్టర్ అవుతోంది. వైజాగ్‌లో అభిమానుల్ని చూసి నాకు నిజమైన ప్రేమ ఏంటో అర్థమైంది. మా డైరెక్టర్ ప్రవీణ్ ఎనర్జీ చూసి నేను అంతా మర్చిపోయాను. నిర్మాతగా నేను ఓ కొత్త ఆలోచనతో ఈ ‘శుభం’ సినిమాను స్టార్ట్ చేశాను. కొత్త వారిత,ో కొత్త కథల్ని చేసి అందరినీ అలరించాలనే ఉద్దేశంతో ట్రాలాలా ప్రొడక్షన్ బ్యానర్‌ను స్టార్ట్ చేశాను. అదే నా లక్ష్యం. మే 9న ఫ్యామిలీతో కలిసి మా మూవీని చూడండి. ఈ సినిమాను చూసి థియేటర్ నుంచి చిరునవ్వుతో బయటకు వస్తారు’ అని అన్నారు. ‘ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది. ఇంత వరకు తెలుగులో ఇలాంటి కంటెంట్‌గాని, ఇలాంటి హారర్, కామెడీ జోనర్‌లో చిత్రాలు రాలేదు. సమంత లాంటి వారు లేకపోతే మా సినిమా ఇక్కడి వరకు వచ్చి ఉండేది కాదు’ అని దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల చెప్పారు.


# బేబీ బంప్‌తో మెగా గ్లామర్

కియారా అద్వానీ.. బాలీవుడ్, తెలుగు సినిమాల్లో ప్రముఖ నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్న విషయం తెలిసిందే. ఫగ్లీ సినిమాతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ఎమ్ఎస్ ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ, కబీర్ సింగ్, గుడ్ న్యూస్ వంటి సినిమాలతో స్టార్ హీరోయిన్ గా తన రేంజ్ ను పెంచుకుంది. ఇక తెలుగులో భరత్ అనే నేను, వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్ సినిమాల్లో నటించింది. కియారా నటనతో పాటు ఆమె అందం, స్టైల్‌తో అభిమానులను ఆకర్షిస్తుంది. మెట్ గాలా 2025లో కియారా తన బేబీ బంప్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె బంగారు రంగు టాప్, నలుపు గౌన్, తెల్లని క్లాత్‌తో అద్భుతంగా కనిపించింది. ఈ డ్రెస్‌ను గౌరవ్ గుప్తా డిజైన్ చేశారు. కియారా ఈ ఈవెంట్‌లో తన ప్రెగ్నెన్సీ గ్లోతో మరింత అందంగా కనిపించింది. ఆమె చేతుల్లో రింగ్స్, సింపుల్ నెక్లెస్ ఆమె లుక్‌ను హైలెట్ చేశాయి. కియారా 2023లో సిద్ధార్థ్ మల్హోత్రాను పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వీరి ప్రేమ శేర్‌షా సినిమా సెట్‌లో మొదలైంది. 2025 ఫిబ్రవరిలో వీరు తమ మొదటి బిడ్డను ఆశిస్తున్నట్లు ప్రకటించారు. ఇక కియారా ఇప్పటికే పలు సినిమాల షూటింగ్స్ లో పాల్గొంది. వార్ 2 లో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్‌తో కనిపించనుంది. అలాగే టాక్సిక్ అనే కన్నడ పాన్ ఇండియా సినిమాలో యష్‌తో నటిస్తోంది. మరి ఈ సినిమాలు అమ్మడికి ఏ స్థాయిలో విజయాలను అందిస్తాయో చూడాలి.

# ప్రతినాయకుడిగా సుహాస్

ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్ తన 16వ ప్రాజెక్ట్‌గా ‘మండాడి’ అనే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాను నిర్మిస్తు న్నారు. ‘సెల్ఫీ’ సినిమాతో తన ప్రతిభను నిరూపించుకున్న దర్శకుడు మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాన పాత్రలో నటుడు సూరి కనిపించనున్న ఈ చిత్రంలో తెలుగులో మంచి గుర్తింపు పొందిన సుహాస్ కోలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నారు. కథానాయికగా మహిమా నంబియార్ నటిస్తున్న ఈ చిత్రాన్ని అన్ని భాషల్లోను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల టైటిల్, సూరి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన నిర్మాతలు తాజాగా సుహాస్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. లుంగీ ధరించి, నెరిసిన జుట్టుతో, జెర్సీ వేసుకుని ‘సునామీ రైడర్స్’ బృందంతో సముద్ర తీరంలో నిలిచిన సుహాస్ రూపం అభిమానులను ఆకట్టు కుంటోంది. మరో పోస్టర్‌లో సూరి, సుహాస్ ఇద్దరూ స్వయంగా పడవలు నడు పుతూ ఒకరికి ఒకరు వ్యతిరేకంగా కనిపించడం సినిమాలో వారి మధ్య జరిగే గట్టి పోరును సూచిస్తోంది. సుహాస్ ఈ చిత్రంలో బలమైన ప్రతినాయకుడిగా కనిపించ నున్నారు. గత సినిమాలతో పోలిస్తే సుహాస్ పోషిస్తున్న పాత్ర ప్రేక్షకులను కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది. గతంలో ఎన్నడూ కనిపించని రీతిలో ఆయన ఈ సినిమాలో కనిపించబోతున్నారు. సత్యరాజ్, రవీంద్ర విజరు, అచ్యుత్ కుమార్ వంటి అద్భుత నటులు కూడా ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు.





# ప్రపంచం నీతో చెలగాటమాడుతున్నప్పుడు స్వచ్ఛంగా ఉండు

హీరోయిన్ అదితి రావు హైదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ బాలీవుడ్, తమిళ, తెలుగు సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందింది. అదితి రావు హైదరి తెలుగు సినిమా పరిశ్రమకు 2018లో సమ్మోహనం సినిమాతో పరిచయమైంది. అదితి రావు హైదరి.. నటుడు సిద్ధార్థ్‌ని 2024 సెప్టెంబర్ 16 న వివాహం చేసుకుంది. అదితి రావు హైదరి నటుడు సిద్ధార్థ్‌ని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పెళ్లి వనపర్తిలోని రంగనాథస్వామి ఆలయంలో జరిగింది.
అదితి రావు హైదరి ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తోంది. అలాగే ఆమె తన భర్త సిద్ధార్థ్‌తో కలిసి ఒక వెబ్ సిరీస్‌లో కూడా నటిస్తోంది. అయితే తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది.లేటెస్ట్ లుక్ పంచుకుని.. ఓ క్యాప్షన్ రాసుకొచ్చింది “నీటి మార్గం ప్రవహించు, ఆడుకో,,అనుకూలంగా ఉండు, మలచు, నీ మార్గాన్ని సొంతం చేసుకో, శుద్ధి చేసుకుంటూ ఉండు, ప్రపంచం నీతో చెలగాటమాడుతున్నప్పుడు స్వచ్ఛంగా ఉండు, దారిలో మెరుస్తూ ఉండు .. శాశ్వతంగా విలువైనదిగా ఉండు” అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ నటి పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.



# విషయం ఏదైనా గళం విప్పాలి

‘విషయం ఏదైనా గళం విప్పాలి’ అని ప్రముఖ సినీనటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. ప్రభుత్వ విధి విధానాలపై ‘ఎక్స్’ వేదికగా తన గళాన్ని ప్రకాష్‌రాజ్ వినిపిస్తూనే ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ’’ ప్రభుత్వం ఏదైనా సరే.. చర్చలను అణచివేస్తుంది. మరో విషయం ఏమిటంటే.. ఒక విషయంపై మాట్లాడాలా ? లేదా అనేది నటీనటులపైనే ఆధారపడి ఉంటుంది. సినిమాల మేకింగ్ విషయంలో వారికంటూ ఒక అవగాహన ఉండాలి. ఆ సినిమాను విడుదల చేయడానికి కూడా పోరాటం చేయాల్సి ఉంటుంది. నిజం చెప్పాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడరంటే.. ఇండిస్ట్రీలోని సగం మంది నటీనటులు అమ్ముడుపోయారు. మరికొంతమందికి మాట్లాడే ధైర్యం లేదు. నా మిత్రుడు ఒకరు ఇదే విషయాన్ని చెబుతూ ఏమన్నారంటే ‘ప్రకాశ్ రాజ్ నీకు ధైర్యం ఉంది. నువ్వు మాట్లాడగలుగుతున్నావు. కానీ నాకు అంత ధైర్యం లేదు’ అన్నాడు. అతడి పరిస్థితి నేను అర్థం చేసుకోగలను. కానీ ఒక్క విషయాన్ని చెప్పగలను. నేరాలు చేసిన వారినైనా చరిత్ర వదిలేస్తుందేమో కానీ, మౌనంగా కూర్చున్నవారిని మాత్రం విడిచిపెట్టదు. ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిందే ’’ అని ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు. బాలీవుడ్‌లో తనకు అవకాశాలు తగ్గడంపై ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ.. ’’నేను ఏదైనా సూటిగా మాట్లాడతాను. రాజకీయ విషయాలపై నా అభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు బయటపెడుతుంటా. ఒకవేళ నాతో వర్క్ చేస్తే.. భవిష్యత్తులో తమకు సమస్యలు వస్తాయని వారు భావించి ఉండొచ్చు. అందుకే నాకు అవకాశాలు తగ్గాయి. ఇలాంటి పరిస్థితులు చూసిన తర్వాతే.. విషయం ఏదైనా గళం విప్పాలనే భావన నాకు కలిగింది’’ అని వివరించారు.



## చిన్న థియేటర్లు నిర్మిద్దాం

‘చిన్న థియేటర్లు నిర్మించుకోవటం ద్వారానే సినిమా రంగాన్ని బతికించుకోగలం. వ్యాపార ధృక్పథంతో కాకుండా సినిమా రంగాన్ని బతికించుకోవాలనే తపనతో ఎన్నో ఏళ్లుగా ఇలాంటి కృషిచేస్తున్నాను. నగరాలు, పట్టణాల నడిబొడ్డున ఉన్న థియేటర్లు వ్యాపార సము దాయాలుగాను, కళ్యాణ మండపాలుగా మారిపోతున్నాయి. జనాభా విస్తరణకు అనుగుణంగా అందరికీ అందుబాటులో ఉండేలా చిన్న థియేటర్లు లేవు. నిర్మితం కావాలి. ఇప్పటికైనా సినీరంగ పెద్దలు ఈ విషయమై శ్రద్ధ తీసుకుని కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నా’ అని బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సినీరంగ ప్రముఖులు బల్వంత్‌సింగ్ కోరారు. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్‌లో బాలీవుడ్ సూపర్ స్టార్స్ అమీర్‌ఖాన్, షారూక్‌ఖాన్ కూడా మాట్లాడుతూ ‘థియేటర్లు పెంచుకోకపోతే సినిమారంగం మెల్లగా చచ్చుపడిపోవడం ఖాయం..సూపర్‌డూపర్ హిట్టయిన సినిమాలను సైతం మన దేశ జనాభాలో రెండు శాతం మంది మాత్రమే చూస్తున్నారు. ప్రేక్షకులకు థియేటర్లు అందుబాటులో లేకపోవటమే కారణం’ అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. తాజాగా బల్వంత్‌సింగ్ వారి ప్రసంగాన్ని స్వాగతిస్తూ తాను కూడా సినిమా పరిశ్రమ బాగుపడాలనే సదాశయంతో పనిచేస్తున్నానని వివరించారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in